నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్-నిర్మల్
5 | నిజామాబాద్, శుక్రవారం 6 సెప్టెంబర్ 2024 | ADILABAD NIRMAL

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

వివరాలు వెల్లడిస్తున్న నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి

సారంగాపూర్, సెప్టెంబర్ 5 : చించోలి(బి) ఎక్స్ రోడ్డు వద్ద గంజాయి తరలిస్తున్న వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మణచాంద మండలంలోని నర్సాపూర్(డబ్ల్యూ) గ్రామానికి చెందిన బాత్‌నాసి హారీఫ్, నిర్మల్ పట్టణంలోని విశ్వనాథ్‌పేట్‌కు చెందిన షేక్ ఇమ్రాన్‌లు మహారాష్ట్రలోని కిన్వాట్ నుంచి గంజాయిని తీసుకొచ్చి నిర్మల్ పరిసర ప్రాంతాల్లో అమ్మడానికి యత్నించారు. గురువారం చించోలి(బి) ఎక్స్‌రోడ్డు వద్ద నిర్మల్ సీఐ రామకృష్ణ, సారంగాపూర్ ఎస్ఐ శ్రీకాంత్, సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. ఇద్దరు వ్యక్తుల వద్ద ఒక కిలో గంజాయితోపాటు ఒక మోటార్ సైకిల్, మూడు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ గంగారెడ్డి, ఆధ్వర్యంలో చాకచక్యంగా వ్యవహరించిన నిర్మల్ రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్ఐ శ్రీకాంత్, సీసీఎస్ఐఎస్ సాయి, రవిలను నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల అభినందించారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న మాజీ సర్పంచ్‌లు

అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న మాజీ సర్పంచ్‌లు

నిర్మల్ చైన్‌గేట్, సెప్టెంబర్ 5 : గ్రామ పంచాయతీ ద్వారా సర్పంచ్‌లకు రావాల్సిన పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని కోరుతూ గురువారం నిర్మల్ జిల్లాకు చెందిన మాజీ సర్పంచ్‌లు అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు మాట్లాడుతూ.. తమ పదవి కాలంలో చేపట్టిన అభివృద్ధి పనులన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. తమ పదవీ కాలం ముగిసి ఎనిమిది నెలలు కావస్తున్నా బిల్లులు చెల్లించలేదన్నారు. చేసిన పనులకు బిల్లులు రాక రాష్ట్రంలో 19 మంది సర్పంచ్‌లు మృతి చెందారన్నారు. ప్రభుత్వం స్పందించి పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు కడ్గాం రాజు, డి. వెంకటేశ్, శివాజీ, కిష్టయ్య పాల్గొన్నారు.

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని జైనూర్‌లో మాట్లాడుతున్న అధికారులు

జైనూర్‌లో పటిష్ట భద్రత

- పోలీసుల అదుపులో మండల కేంద్రం
- జైనూర్‌తోపాటు ఏజెన్సీ మండలాల్లో 144 సెక్షన్ అమలు
- సంయమనం పాటించాలి: అదనపు డీజీ మహేశ్ భగవత్

మంచిర్యాల, సెప్టెంబర్ 5(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఆదివాసీ మహిళపై ఓ వర్గానికి చెందిన వ్యక్తి దాడి నేపథ్యంలో ఆసిఫాబాద్ జిల్లా జైనూర్‌లో చోటు చేసుకున్న పరిస్థితులను పోలీసులు అదుపులోకి తీసుకొస్తున్నారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ దౌత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారీతోపాటు అడిషనల్ డీజీ(లాఅండ్‌ఆర్డర్) మహేశ్ భగవత్, నార్త్ జోన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, ఆసిఫాబాద్ ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు, సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్, ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం, బాలానగర్ డీసీపీ(ఆసిఫాబాద్ పాత ఎస్పీ) సురేశ్ కుమార్ జైనూర్‌లోనూ ఉంటూ పరిస్థితులను సమీక్షిస్తున్నారు. దాదాపు 1000 మంది ప్రత్యేక పోలీసు బలగాలతో జైనూర్‌లో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. జైనూర్‌లో 48 గంటలు, ఏజెన్సీ మండలాలైన ఇంద్రవెల్లి, నార్నూర్, ఉట్నూర్, గాదిగూడ మండలాల్లోనూ 144 సెక్షన్ అమలులో ఉందని తెలిపారు. జైనూర్‌లోని ఎంపీడీవో సమావేశ మందిరంలో గురువారం పెద్దలు, నాయకులు, అధికారులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు.

అందరూ సంయమనం పాటించాలి

- అదనపు డీజీ మహేశ్ భగవత్, కలెక్టర్ వెంకటేశ్ దౌత్రే

ఆదివాసీ మహిళపై దాడి జరగడం బాధాకరమని, ఈ ఘటనపై ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలిగించవద్దని అదనపు డీజీ మహేశ్ భగవత్, కలెక్టర్ వెంకటేశ్ దౌత్రే పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు ప్రెస్‌నోట్‌ను రిలీజ్ చేశారు. బాధిత కటుంబానికి ప్రభుత్వం అండగా ఉందని, వైద్య ఖర్చులను భరిస్తుందన్నారు. జైనూర్ ఘటనలో జరిగిన ఆస్తి నష్టంపై పూర్తిస్థాయి నివేదిక అందించేందుకు కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్‌ను ప్రత్యేక అధికారిగా నియమించామన్నారు.

ర్యాలీలు, సభలు, సమావేశాలకు అనుమతులు లేవు

ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం

ఎదులాపురం, సెప్టెంబర్ 5 : జైనూర్ ఘటన దృష్ట్యా ఆదిలాబాద్ వ్యాప్తంగా ప్రజలు ఎలాంటి సభలు, ర్యాలీలు, సమావేశాలు నిర్వహించకూడదని ఎస్పీ గౌష్ ఆలం ఒక ప్రకటనలో తెలిపారు. అనుమతులు లేకుండా గుమిగూడిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాలోని అన్ని మండలాలలో 163 బీఎన్ ఎస్ఎస్ సెక్షన్(144 సెక్షన్) అమల్లో ఉంటుందని తెలిపారు. ప్రజలందరూ సంయమనం పాటించాలని సూచించారు.

ఎమ్మెల్యే వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

- సీసీఐని కేంద్రం ప్రారంభించాలి
- పంట నష్టం పక్కన పెట్టి సీసీఐ సందర్శనకు సమయమా?
- మాజీ మంత్రి జోగు రామన్న

ఎదులాపురం, సెప్టెంబర్ 5 : ఇటీవల మంత్రి శ్రీధర్‌బాబు ఆదిలాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్ పంటలు నష్టపోయిన రైతులకు భరోసా ఇవ్వాల్సి ఉండగా.. సమయాన్ని వృథా చేశారని అన్నానే తప్పా ఎమ్మెల్యేపై వ్యక్తిగత దూషణలు చేయలేదని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం సీసీఐని పునఃప్రారంభించాలే తప్పా ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టి కమీషన్లు దుండుకోవాలని ఆలోచన మానుకోవాలని సూచించారు. మంత్రితోపాటు ఎమ్మెల్యే రైతులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పి నష్ట పరిహారం విషయంలో హామీ ఇవ్వాల్సి ఉండగా రైతులను పట్టించుకోకుండా మంత్రితో కలిసి సీసీఐని సందర్శించడాన్ని మాత్రమే తాను వ్యతిరేకించానన్నారు. పాయల్ శంకర్ అనుభవాన్ని పెంచుకుని ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. రేణుక సిమెంటు ఫ్యాక్టరీ విషయంలో రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని ఎమ్మెల్యే ఎందుకు ప్రస్తావించడం లేదని, ఎకరాకు రూ.40 లక్షల పరిహారం ఇప్పించేలా కలెక్టర్ వినతిపత్రం ఇవ్వాలని తాను కూడా వస్తానని సూచించారు. పదేండ్లు కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉందని, ఐదేండ్లు బీజేపీ ఎంపీగా ఉన్న సీసీఐ విషయంలో ఏ మాత్రం పట్టించకోలేదని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం సీసీఐని ప్రారంభించడానికి అన్ని ప్రయత్నాలు చేసిన కేంద్ర ప్రభుత్వం స్పందించలేదన్నారు.

బాలికల గురుకులాన్ని సందర్శించిన సీనియర్ సివిల్ జడ్జి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య

లోటుపాట్లను సరి చేసుకున్నారు

సీనియర్ సివిల్ జడ్జి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య

ఎదులాపురం, సెప్టెంబర్ 5 : తనిఖీలో గుర్తించిన లోటుపాట్లను సరి చేసుకున్నారని సీనియర్ సివిల్ జడ్జి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలిక గురుకుల పాఠశాల, కళాశాలను సందర్శించారు. గత నెల 22వ తేదీన తనిఖీ చేసిన సమయంలో కొన్ని లోటుపాట్లను గుర్తించామని తెలిపారు. సమస్యలు, లోటుపాట్లపై సుమోటోగా పీఎల్‌సీ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ లోటుపాట్లను సరి చేసుకునేందుకు ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కళాశాల ప్రిన్సిపాల్ లలిత కుమారి సమయాన్ని అడిగారన్నారు. దీంతో కళాశాలను సందర్శించిన సమయానికి గుర్తించిన లోటుపాట్లను సరి చేసుకున్నారు. కొన్ని సమస్యలు పరిష్కారం అయ్యాయిని తెలిపారు. నూతన భవనాన్ని మరో రెండు నెలల్లో అందుబాటులోకి వచ్చేలా కృషి చేస్తామన్నారు.

ప్రజలకు సర్వీస్ ఇవ్వాలనే డీఎల్ఎస్ఏ పని చేస్తున్నది

కోర్టులో కూర్చొని జడ్జిమెంట్లు ఇవ్వడమే కాకుండా ప్రజలకు సర్వీస్ ఇవ్వాలనే ఉద్దేశంతో న్యాయ సేవ అధికార సంస్థ పని చేస్తున్నదని డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సౌజన్య అన్నారు. గురువారం పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ బాలికలకళాశాల, పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు చట్టాలపై సైబర్ సెల్ సిబ్బంది సంతోష్, సాయిశివలు సైబర్ క్రైమ్ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ న్యాయవాది దాసరి గంగారాం. ప్రిన్సిపాల్ లలిత కుమారి, వైస్ ప్రిన్సిపాల్ ఆనంద్ రెడ్డి పాల్గొన్నారు.

స్టార్లలో అరెస్టుల భయం

బిట్‌కాయిన్ దందాలో ఏం జరుగుతుందోననే ఆందోళన

- మెజార్టీ స్టార్లు ఉద్యోగులు, ఉపాధ్యాయులు
- అరెస్టుల నుంచి బయట పడేందుకు ఎత్తుగడలు
- ఆ సంఘం నాయకుడు, అధికార పార్టీ నేత చెంతకు స్టార్లు
- కాయిన్స్ కొనే వారు లేక జగిత్యాల స్టార్‌లతో సంప్రదింపులు
- కాయిన్‌లు రూపాయలుగా మారకపోవడంతో సామాన్యుల ఆందోళన



మరో 20 మంది ప్రభుత్వ ఉద్యోగులను పోలీసులు కస్టడీలోకి తీసుకొనున్నారని సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న మెస్సేజ్

ఖానాపూర్ టౌన్, సెప్టెంబర్ 5 : క్రిప్టో కరెన్సీ, బిట్‌కాయిన్ పేరిట ఆన్‌లైన్‌లో పెట్టుబడులు పెట్టించిన వారి గుండెల్లో రైళ్లు పరుగెతుతున్నాయి. కోట్ల రూపాయలు కొల్లగొట్టిన స్టార్లు ఎప్పుడు అరెస్టు అవుతామోననే భయం వెంటాడుతున్నది. ఈ మధ్య కాలంలో ఐదుగురిని అరెస్టు కూడా చేశారు. ఇందులో నలుగురు ప్రభుత్వ ఉద్యోగులు కాగా, మరొకరు ప్రభుత్వ ఉద్యోగం వదిలేసి దందాను నడుపుతున్న వ్యక్తి కావడం విశేషం. వీరిలో భయం నెలకున్నది. దీంతో రెండు రోజులుగా రహస్య ప్రాంతాల్లో సమావేశాలు ఏర్పాటు చేసుకున్నారనే ప్రచారం జరుగుతున్నది. ఖానాపూర్‌కు చెందిన ఓ అధికార పార్టీ నేత, తమ సంఘం నాయకులను సంప్రదించి అరెస్టుల నుంచి బయటపడాలనే ఆలోచన చేస్తున్నారు. ఇందుకోసం పెద్ద ఎత్తున మూల్యం చెల్లించుకునేందుకు ఒప్పందాలు చేసుకునేందుకు మంతనాలు కూడా జరుగుతున్నాయని ప్రచారం ఉంది.

ఖానాపూర్ టూ జగిత్యాల..

బిట్ కాయిన్‌లో పెట్టుబడులు పెట్టించిన పెద్ద స్టార్లు అరెస్టు కావడంతో ప్రస్తుతం ఖానాపూర్ ప్రాంతంలో కాయిన్‌లను కొనుగోలు చేసే వారే కరువయ్యారనే ప్రచారం జరుగుతోంది. దీంతో స్టార్‌లను నమ్మి పెట్టుబడులు పెట్టిన సామాన్యులు తమ డబ్బులను కాయిన్‌ల రూపం నుంచి రూపాయల్లోకి మార్చుకునేందుకు ఎవరిని సంప్రదించాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో తమను పెట్టుబడులు పెట్టించిన స్టార్‌లను సామాన్యులు నిలదీయడంతో వారు ఎలాగైన కాయిన్‌లను రూపాయలలోకి మార్చి ఇస్తామని హామీ ఇస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ కాయిన్‌లను మార్చేందుకు ఈ ప్రాంతంలోని స్టార్లు జగిత్యాల ప్రాంతంలో అత్యంత కీలకంగా వ్యవహరిస్తున్న ఓ పెద్ద స్టారుతో సంప్రదింపులు జరిపి కాయిన్‌లను తక్కువ ధరకైనా సరే కొనుగోలు చేయాలని ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం. దీంతో ఈ తదంగం పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

ఆన్‌లైన్ పెట్టుబడికి సంబంధించి వివరాలు

బాసర ట్రిపుల్ ఐటీలో ర్యాలీ తీస్తున్న విద్యార్థులు

బాసర ట్రిపుల్ ఐటీ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు

రెండో రోజు ఆందోళన

బాసర, సెప్టెంబర్ 5 : బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థులు రెండో రోజైన గురువారం ఆందోళన చేపట్టారు. తమ 17 డిమాండ్లను పరిష్కరించేంత వరకు ఆందోళన చేస్తామని బుధవారం నిర్వహించిన ఆందోళనలో విద్యార్థులు ట్రిపుల్ ఐటీ అధికారులకు తెలిపారు. ఇందులో భాగంగానే రెండో రోజు ఆందోళన చేపట్టారు. క్యాంపస్‌లో ర్యాలీ నిర్వహించి, వీసీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రెగ్యూలర్ వీసీ కావాలని, సమస్యలను పరిష్కరించాలని ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు.

గణేశ్ నిమజ్జనానికి వెళ్లే రూట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

శాంతియుతంగా జరుపుకోవాలి

నిమజ్జన రూట్‌ను పరిశీలించిన నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

భైంసా, సెప్టెంబర్ 5 : పండుగలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. గురువారం పట్టణంలోని వినాయక నిమజ్జన రూట్ మ్యాప్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యుత్ తీగలు, రహదారుల మరమ్మతులను సంబంధిత అధికారులు త్వరగా పూర్తి చేయాలన్నారు. అనంతరం భట్టిగట్టి మున్నురుకాపు సంఘం భవనం ముందు వినాయక విగ్రహాలు వెళ్లే నిమజ్జన దారులను నడుచుకుంటూ వెళ్లి పరిశీలించారు. అనంతరం గడ్డెన్నవాగు ప్రాజెక్టు వద్ద నిమజ్జన ప్రాంతాన్ని పరిశీలించారు. నిమజ్జనానికి అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని సంబంధిత మున్సిపల్ అధికారులకు ఆదేశించారు. అక్కడి నుంచి నేరుగా భైంసా ప్రాంతీయ ఆసుపత్రికి చేరుకుని ఆసుపత్రిని పరిశీలించారు. అంతేగాకుండా ఖాళీగా ఉన్న టువంటి పోస్టులను భర్తీ చేయడం జరుగుతుందన్నారు. ఆర్డీవో కోమల్‌రెడ్డికి వారానికి ఒకరోజు ఆసుపత్రిని సందర్శించాలని సూచించారు. ఈమె వెంట ఏఎస్పీ అవినాశ్ కుమార్, ఆర్డీవో కోమల్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాజేశ్ కుమార్, పట్టణ సీఐ రాజారెడ్డి, డీటీ అశోక్ కుమార్, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ కాశీనాథ్ ఉన్నారు.

ఏడేండ్ల జైలు

ఆదిలాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు

ఎదులాపురం, సెప్టెంబర్ 5 : వరకట్నం చావు కేసులో నేరస్తుడైన భర్తకు ఏడేండ్ల కఠిన కారగార శిక్ష విధిస్తు తీర్పును జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు వెలువరించినట్లు జిల్లా లైజన్ అధికారి గంగాసింగ్ తెలిపారు. తీర్పుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఆదిలాబాద్ పట్టణంలోని ఖుర్దీద్‌నగర్‌కు చెందిన షేక్ సైదా అక్టోబర్ 24, 2021న పట్టణంలోని ఖానాపూర్‌కు చెందిన షేక్ అయ్యుబ్(28) లారీ మెకానిక్‌తో పెళ్లయింది. పెండ్లికి రూ.50 వేల కట్నం, ఇంటి సామగ్రి కొనిస్తామని ఒప్పుకున్నారు. ఒక నెల కలిసి ఉన్నారు. తరువాత ఒప్పుకున్న కట్నం తీసుకురావాలని భర్త షేక్ అయ్యుబ్‌తోపాటు తల్లి, అన్నదమ్ములు మానసికంగా, శారీరకంగా వేధించారు. ఈ విషయం షేక్ సైదా తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో భర్తకు ఒప్పుకున్న ప్రకారం కట్నం, సామగ్రి ఇస్తామని చెప్పినప్పటి వేధించడం మానలేదు. మే 6, 2022న షేక్ సైదా రైల్వే పట్టాలపై పడి చనిపోయింది. మొదటగా రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, తర్వాత ఆదిలాబాద్ టూ టౌన్‌లో వివిధ సెక్షన్ల కింద ఎస్ఐ కె.విష్ణుప్రకాశ్ కేసు నమోదు చేశారు. అప్పటి డీఎస్పీ వెంకటేశ్వర్ కేసు దర్యాప్తు చేసి చార్జిషీట్ కోర్టులో దాఖలు చేశారు. కేసులో అప్పటి పీపీ సంజయ్‌కుమార్ 19 మంది సాక్షులను ప్రవేశ పెట్టి నేరం రుజువు చేయగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి కే. ప్రభాకర్‌రావు గురువారం తీర్పును వెలువరించారు.

మాతా, శిశు ఆరోగ్య రక్షణే లక్ష్యం

ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

బేల, సెప్టెంబర్ 5 : మాతా, శిశు సంపూర్ణ ఆరోగ్య రక్షణే లక్ష్యంగా యేటా పోషణ్ అభియాన్ పేరిట మాసోత్సవాలను నిర్వహిస్తున్నామని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం చిన్నుగూడ గ్రామంలో ఏర్పాటు చేసిన పోషణ మాసోత్సవాల్లో కలెక్టర్ రాజర్షి షా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గర్భిణులు అంగన్‌వాడీలో ఇస్తున్న పౌష్టికాహారం, బాలమృతం మధ్యాహ్న భోజనాన్ని రోజు తీసుకోవాలన్నారు. అనంతరం బేల గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని కలెక్టర్ సందర్శించి ఓటరు నమోదు ప్రక్రియను ఆన్‌లైన్ ద్వారా పరిశీలించారు. వార్డులవారీగా నిర్వహించిన గ్రామ పంచాయతీ ఓటరు జాబితా తయారీని పంచాయతీ కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వామన్‌రావ్, ఎంపీడీవో మహేందర్, ఎంపీవో వినోద్ పాల్గొన్నారు.

చిరుధాన్యాలను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

ఉత్తమ అవార్డు అందుకున్న ఉపాధ్యాయులు

ఉపాధ్యాయుల పాత్ర కీలకం

ఉపాధ్యాయ దినోత్సవంలో కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, సెప్టెంబర్ 5 : సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. గురువారం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఆర్కే కన్వెన్షన్ హాల్లో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ దినోత్సవానికి కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సమాజంలో ఉపాధ్యాయులకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు పాటు పడాలన్నారు. విద్యార్థులకు పాఠశాల దశ అత్యంత కీలకమైందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాణించాలన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉపాధ్యాయులకు అవార్డులు అందించారు. ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు అందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, డీఈవో రవీందర్‌రెడ్డి ఉన్నారు.

ప్రభుత్వం పట్టించుకోలేదు..

- ఫాస్ట్‌ట్రాక్ట్ కోర్టు ఏర్పాటు చేసి బాధిత మహిళకు న్యాయం చేయాలి
- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్

విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఎదులాపురం, సెప్టెంబర్ 5 : పార్లమెంట్ ఎన్నికల సమయంలో జైనూర్ మండలంలో ఆదివాసులపై దాడి జరిగిన సమయంలో హెచ్చరించినా ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని, దాని కారణంగా నేడు ఆదివాసీ మహిళపై లైంగికదాడి, హత్యాయత్నం జరిగిందని ఎమ్మెల్యే పాయల శంకర్ ఆరోపించారు. జైనూర్ ఘటన నేపథ్యంలో పోలీసులు ఎమ్మెల్యే నివాసం వద్ద బందోబస్తు నిర్వహించారు. ఎమ్మెల్యేను బయటకు రానివ్వకుండా హౌజ్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆదివాసీ మహిళ పరిస్థితి గురించి మాట్లాడకుండా ఎంఐఎం నేత అసదుద్దీన్ ఓవైసీ ఓ వర్గం వారిని మద్దతు ఇచ్చేలా మాట్లాడడం సరికాదన్నారు. వెంటనే ఫాస్ట్‌ట్రాక్ట్ కోర్టు ఏర్పాటు చేసి నిందితుడిని ఉరి తీయాలని డిమాండ్ చేశాడు.

ఆదివాసులపై ప్రభుత్వానికి పట్టింపు లేదు..

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డి తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆదివాసీ మహిళ ఘటనను తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ఈ ఘటన దొంగతనం కోసం జరిగిందని, అత్యాచారం జరగలేదని చెప్పవడం విడ్డూరంగా ఉందన్నారు.